

లక్కీ డ్రాలో దక్కిన 111 కిలోల గణనాథుని లడ్డూతో మోటుకూరి రమేశ్ కుమార్తె శ్రీభవిష్య వారి కుటుంబ సభ్యులు

# లక్కీ లడ్డూ

- రూ.111తో.. 111కిలోల గణపతి లడ్డూ

ఎల్బీనగర్, సెప్టెంబర్ 30: లక్షలు వెచ్చించి గణనాథుని లడ్డూను వేలంలో కొనుగోలు చేస్తున్న క్రమంలో ఓ కుటుంబానికి గణపతి ఆశీస్సులతో లక్కీడ్రా రూపంలో ఆనందాన్ని తెచ్చింది. లక్కీడ్రాలో రూ.111 వెచ్చించి టోకెన్ కొనుగోలు డ్రాలో 111 కిలోల లడ్డూ దక్కడంతో తమపై గణనాథుని ఆశీర్వాదం ఉందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ నియోకవర్గంలో మోహన్‌నగర్ శృంగేరి కాలనీలో ఏకదంత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథున్ని ప్రతిష్ఠించి మండపంలో ఏకంగా 111 కిలోల లడ్డూ పెట్టారు. ఈ లడ్డూను వేలం కోసం కాకుండా లక్కీడ్రా ద్వారా అందజేయాలని అసోసియేషన్ వారు భావించారు. ఈ మేరకు ఒక్క లడ్డూ టోకెన్ రూ.111గా నిర్ణయించారు. ఈ క్రమంలో పదకొండు రోజుల పాటు గణనాథుని పూజల్లో భాగం పంచుకున్న లడ్డూను నిమజ్జనం రోజున లక్కీడ్రాను తీశారు. ఈ డ్రాలో శృంగేరి కాలనీకే చెందిన మోటూకూరి రమేశ్ కుమార్తె శ్రీభవిష్యకు లడ్డూ దక్కింది. లక్కీడ్రాలో 111 కిలోల భారీ లడ్డూ దక్కడంతో వారి కుటుంబం ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు లడ్డూను శ్రీ భవిష్య కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏకదంత అసోసియేషన్ ప్రతినిధులు సూరజ్, శ్రీకాంత్, ప్రియాంక, త్రిశూల్, బాబా, శరత్, అభిషేక్, తేజ్‌దీప్, రోహిత్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కన్నయ్య ముదిరాజ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## యూత్‌లో బీఆర్ఎస్ జోష్ నింపుతా



రవిముదిరాజ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట, సెప్టెంబర్ 30: ఎల్బీనగర్ యువతలో బీఆర్ఎస్ జోష్ నింపుతా.. ఎల్బీనగర్ గడ్డమీద బీఆర్ఎస్ జెండా ఎగురవేసి, మరోసారి సుధీరన్నే ఎమ్మెల్యే అని నిరూపిస్తానని బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్‌వింగ్ నూతన అధ్యక్షుడు రవిముదిరాజ్ తెలిపారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శనివారం బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్‌వింగ్ నూతన అధ్యక్షుడిగా చంపాపేట డివిజన్‌కు చెందిన రవిముదిరాజ్‌ను నియమిస్తూ సదరు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ మన్మయ సంఘం రాష్ట్ర కార్యదర్శి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఓరుగంటి వెంకటేశం గౌడ్, బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్ కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, హనుమాన్ ఆలయ ధర్మకర్త గోగిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు ఆనగొంది జంగయ్య, చీర శ్రీనివాస్, తలారి సత్యప్రకాశ్, కనకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ వాల్ రైటింగ్, వాల్ పోస్టర్లు, ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

# ప్రచార హోరు!

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఆత్మీయ సమ్మేళనాలతో దూసుకుపోతున్న బీఆర్ఎస్
- స్పీడ్ పెంచిన ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- కాంగ్రెస్, బీజేపీల్లో తేలని అభ్యర్థిత్వం
- ప్రజల్లోకి ఎలా వెళ్లాలో తెలియక విపక్షాలు సతమతం
- గ్రూపు తగాదాలతో క్యాడర్‌లోనూ అయోమయం
- ప్రజల మధ్యే ఉంటున్న గులాబీ సైన్యం
- తిరుగులేని శక్తిగా అవతరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ.. నేతల్లో సరికొత్త జోష్

ఎల్బీనగర్, సెప్టెంబర్ 30: ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు ప్రజల ఆదరణ రోజురోజుకూ పెరుగుతున్నది. బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ప్రకటించడంతో జోరు పెంచిన పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టారు. ఆత్మీయ సమ్మేళనాలతో పార్టీని అంతర్గతంగా బలోపేతం చేయడంతో పాటు అసంతృప్తులను బుజ్జగిస్తూ అందరినీ కలుపుకొని పోతూ పార్టీని మరింత బలంగా మారుస్తున్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని యూత్‌ను ఆకట్టుకునే రీతిలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రతి డివిజన్‌లో రెండు, మూడు పర్యాయాలు పర్యటించి గణనాథుని మండపాల సందర్శన చేస్తూ గణనాథులకు పూజలు చేయడంతో పాటు యూత్‌ను ఎంకరేజ్ చేస్తూ ముందుకు సాగారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలు ఇంకా తమ పార్టీ అభ్యర్థులు ఎవరన్న డైలమాలోనే కొనసాగుతుండగా మరోవైపు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రచారంలో దూసుకు పోతున్నారు. పార్టీ ప్రణాళికలు, చేసిన అభివృద్ధితో కూడిన కరపత్రాన్ని తీసుకుని ఇంటింటికీ వెళ్తున్న బీఆర్ఎస్ బూత్‌స్థాయి నాయకుల రాకతో కాలనీలు, బస్తీల్లో ప్రజలు ఆహ్వానిస్తున్న తీరును చూసి అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్‌కే మా మద్దతు అంటూ కాలనీలు, బస్తీల ప్రజలు బహిరంగంగానే ప్రటిస్తున్నారు. నిత్యం ప్రజల్లోనే ఉండే ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఉదయం సమయంలో కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి బాటలు వేస్తున్నారు. కార్యాలయంలో ప్రజాదర్బార్ నడుపుతూ పార్టీ శ్రేణులతో పాటు కాలనీ సంక్షేమ సంఘాల వారికి అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో కరపత్రాల ప్రచారంతో పాటు చేసిన అభివృద్ధిని పార్టీశ్రేణులు వివరిస్తుండగా ప్రజల నుంచి కూడా అనూహ్య స్పందన లభిస్తున్నది.

***ముందున్న బీఆర్ఎస్..***

గణపతి నవరాత్రులు, గణనాథుల నిమజ్జనం సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్ పార్టీతో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పోటీ పడ్డాయి. ఏ ప్రధాన కూడళి, మినీ ట్యాంక్‌బండ్‌పై చూసినా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు టికెట్టు ఇంకా ప్రకటించకపోయినా ప్రచారంలో తమకే టిక్కెట్టు దక్కుతుందంటూ ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లను ఏర్పాటు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి ఆది నుంచి వాల్ పోస్టర్లతో పోటీలు పడగా, బీజేపీ నాయకులు సామరంగారెడ్డి ఫ్లెక్సీల్లో పోటీలు పడ్డారు. అయితే బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగంలో నిలిచిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రచారం పర్వంలోకి దిగాక ప్రతిపక్ష పార్టీలు వెనుకబడిపోతున్నారు. వాల్ రైటింగ్, వాల్ పోస్టర్లు మొదలుకుని ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేయడంతో బీఆర్ఎస్ శ్రేణులు చూపిస్తున్న చొరవను ప్రతిపక్ష పార్టీలు ప్రదర్శించలేకపోతున్నాయి. ప్రధానంగా అభ్యర్థిత్వం ఖరారు కావడంతో బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జోరు మీదున్నారు. సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా ప్రచార రంగంలో బీఆర్ఎస్ శ్రేణులు యుద్ధప్రాతిపదికన పోస్టింగ్‌లు పెడుతూ తమ అదిపత్యాన్ని చాటుకుంటున్నారు. ఇలా ఎల్బీనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా ప్రచార యుద్ధం మాత్రం కొనసాగుతోంది. ఇక నోటిఫికేషన్ వస్తే ఇది మరింత ఉధృతం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## కాంగ్రెస్ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 30: ఫామ్‌హౌస్ సీఎం అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగినరీతిలో బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి వెంకన్నకురుమ తెలిపారు. సరస్వతినగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క సీఎం కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ను విమర్శిస్తే పెద్ద నాయకులం అవుతామనే భ్రమలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారని తెలిపారు. నగరంలో మత ఘర్షణలు, ఎరువుల కొరత, రైతుల ఆత్మహత్యలు, కరెంటు కోతలు, ధాన్యానికి దళారులే దిక్కుగా పరిపాలన కొనసాగించిన కాంగ్రెస్ నాయకుల చరిత్ర ప్రజలకు తెలుసున్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే గతంలో మాదిరిగా ప్రజలకు కష్టాలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తూ దేశానికే మార్గ నిర్దేశం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కావాలో.. అభివృద్ధి నిరోదకులైన కాంగ్రెస్ పాలన కావాలో ప్రజలే తేల్చుకోవాలని అన్నారు.

## పదవీ విరమణ.. ప్రతి ఉద్యోగికి తప్పదు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 30: బండ్లగూడలోని జీఎస్ఐ సౌథెర్న్ రీజియన్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న వి.సుబ్బలక్ష్మి పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారం జీఎస్ఐ ప్రాంగణంలోని గోదావరి హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్ఐ జాయింట్ డైరెక్టర్ ఎస్.తారకేశ్వర్ మాట్లాడుతూ.. సుబ్బలక్ష్మి అందించిన సేవలు ఎంతో కొనియాడ తగినవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్లు కబీరాజ్ సేతి, ఆర్. శ్రీధర్, ఎం.నర్సింగ్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్లు రాజగోపాల్, బాదాల్ దాస్, కొబ్రా గడ, అనిత బిడేకర్, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ బి.విజయలక్ష్మి, ఆశిష్‌కుమార్ లోధ, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.



జీఎస్ఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వి.సుబ్బలక్ష్మి పదవీ విరమణ కార్యక్రమంలో జీఎస్ఐ జాయింట్ డైరెక్టర్ ఎస్.తారకేశ్వర్ తదితరులు

## ఇసుక లారీల అడ్డాను ఇతర ప్రాంతానికి తరలిస్తాం




ఇసుక లారీల అడ్డా కోసం స్థలం కేటాయింపు విషయంపై టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, సెప్టెంబర్ 30: ఇసుక లారీల అడ్డాను తొలగించి.. పదిహేను సంవత్సరాలుగా సుమారు పదిహేను కాలనీల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు మోక్షం కల్పిస్తామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఇసుక లారీల అడ్డా కోసం మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆటోనగర్‌లోని టీఎస్ఐఐసీ సంస్థకు చెందిన పదకొండు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శనివారం సంస్థ ఎండీ నర్సింహారెడ్డితో ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆటోనగర్‌లోని ప్రధాన రహదారిపై ఉన్న ఇసుక లారీల అడ్డా వలన ప్రజలు, మహిళలు అటువైపు నుంచి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆటోనగర్‌లో ఉన్న పదకొండు ఎకరాల స్థలంలో లారీలు పెట్టుకోవడానికి టీఎస్ఐఐసీ అనుమతినిచ్చిందని తెలిపారు. అతి త్వరలో ప్రజల గత కొన్నేండ్లుగా ఇసుక లారీల వలన పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు. భవిష్యత్తులో ఇసుక లారీలు రోడ్లపై నిలబడకుండా చూస్తామని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసే ఇసుక లారీ అడ్డాలో డ్రైవర్లు, కూలీల కోసం మంచినీటి సౌకర్యం, మూత్రశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇసుక లారీల అడ్డా తరలింపు విషయంపై రెండు రోజుల్లో సమావేశం నిర్వహిస్తామని.. ఈ సమావేశానికి టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డిని హాజరు కావాలని కోరామని తెలిపారు. ఆటోనగర్ పారిశ్రామిక వాడలో రోడ్డు నిర్మాణ పనులకు ఇటీవల శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. సదరు రోడ్డును 7 మీటర్లు కాకుండా 11 మీటర్ల వెడల్పుతో నిర్మించాలని టీఎస్ఐఐసీ ఎండీని కోరగా ఆయన సమ్మతించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, బీఆర్ఎస్ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, నాయకులు శ్రావణ్, లక్ష్మణ్‌రెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, జలంధర్ రెడ్డి, సుధాకర్, ప్రవీణ్‌గౌడ్, సత్తిరెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.